# చెత్తల చెడుగు

"అన్నా... నా పని ఎంత దాకా వచ్చింది" సోముల ముత్తయ్య అడిగిండు.

ఎమ్మెల్యే కాశీరాములు నవ్విండు. నవ్వి "ఐతదైతది. ఉరుకులాడితే నడుత్తదా! నువ్వు దునియాల లేని పని అడిగితివి" అన్నడు.

అతను చెప్పిన తీరు ముత్తయ్యకు నమ్మకాన్ని కలిగించలేదు. ఆరు నెలలకు అయ్యే పనిని గూడా 'ఇగో అరగంటలో అయిపాయె' అని చెప్పే మనిషి. ఇట్లా నామునాలు పడుతుండంటే కత ఏదో ఉందనుకున్నడు.

"అన్నా ఐదేండ్ల కింద కాలేజీకి పర్మీషన్ ఇప్పియ్యిమన్నా!...." అనుమానంగా అడిగిండు ముత్తయ్య.

"ఇప్పిచ్చిన్నా లేదా...?" మాటను అందుకున్నడు కాశీరాములు.

"ఆ... నేను మాత్రం మాట తప్పిన్నా.. అడిగిన వాటా ఇచ్చిన. అదేనోట పరంపోగు భూమి పట్టా అడిగిన్నా!"

"నేను మాట తప్పిన్నా...." కోపంగా అన్నడు ఎమ్మెల్యే కాశీరాములు.

"నేను మాత్రం వాటా తప్పిన్నా...! రియల్ ఎస్టేట్‌లో షేరు ఇచ్చిన. అదే నోట ప్రొక్లయిన్ లోను అడిగిన్నా..."

"సాంక్షన్ చేయించిన్నా..."

● పెద్దింటి అశోక్ కుమార్ ●

"ఆ...గవర్మెంటు దగ్గర అప్పుతెచ్చి గవుర్మెంటుకే లీజుకిచ్చి సగం కమీషన్ నీకే ఇచ్చినగదా!"

"అదంతా ఎందుకు...?" కోపంగా అడిగిండు కాశీరాములు. ఏదో మీటింగుకు వెళ్ళే ఆగంలో ఉన్నడు. సరిగ్గా అప్పుడే కలుసుకున్నడు ముత్తయ్య. పాత దోస్తు గదా అని టైం ఇచ్చి మాట్లాడుతుండు.

"ఇప్పటి పనికోసమే అన్నా.... ఎన్నడన్నా నీకు ఇచ్చిన మాట తప్పిన్నా.... లాసు తెచ్చిన్నా... పని ఎందుకు చేస్తలెవ్వు?" నిలదీసినట్టుగా అడిగిండు ముత్తయ్య. ఆ సోపతి ఉంది వాళ్ళకు.

"అదేమోగాని ఇదైతే లాసేరా... లాభం లేదు. దేశంల ఎవడన్నా ఎప్పుడన్నా ఇటువంటి కంట్రాక్టుపని అడిగిండా...?" కుదురుగా అడిగిండు కాశీరాములు.

"ఎవరు అడుగలేదు గనుకనే నేను అడుగుతున్న. అందరు చేసిన పని చేస్తే ఏం లాభముంటది?" అన్నాడు ముత్తయ్య.

"ఇసుకను అమ్ముకుంటావా...?" అడిగిండు కాశీరాములు.

"చ....చ... లాభం తక్కువ. బదునాం ఎక్కువ. ఇసుక రవ్వ గూడా ముట్ట"

"మరి .... నీళ్ళు అమ్ముకుంటవా..."

"చ....చ.... అదేం పని. ఖర్చు ఎక్కువ లాభం తక్కువ" చెప్పిండు ముత్తయ్య.

కాశీరాములుకు కోపం వచ్చింది. కోపం వస్తే ఆయన మనిషే కాదు. "నీళ్ళు అమ్మనంటవు. ఇసుక ముట్టనంటవు. మరి యాడాది లీజుకు తీసుకుని ఏం చేసుకుంటవురా... గోరి కట్టుకుంటావా..." అన్నాడు.

ఈసారి ముత్తయ్యకు కూడా కోపం ఆగలేదు. "పైస ఇస్త. పని చూడు" అందా మనుకున్నడు. కానీ మాట పెకలలేదు. అసలుకే మోసం వత్తదని ఆగి "నన్ను నమ్ము. సగం సగం పంచుకుందాం. లాభం చూపిస్తెనే మళ్ళీ ఏడాదికి లీజుకియ్యి. లేకుంటే లేదు. ఈ లీజుకు తీసుకొనుడు అక్కడనే ఊర్లెది ఊర్లె గ్రామ పంచాదినుంచో, పంచె కమిటీ నుంచో చేయించుకుందుంటి, కానీ రేపు ఏదన్నా జరిగితే అందరూ చేతులత్తేత్తరు. అందుకని ఈ తంటా" అన్నాడు విసుగ్గా.

కాశీరాములుకు ముత్తయ్య మీద నమ్మకం లేక కాదు. అతను అడిగిన పని మీదనే నమ్మకం లేదు. ఇంకో సంగతి, ఈ పనిని ఎవలు చేస్తరో, ఎవల చేతులుంటదో తెలువది. అడుగాలంటేనే 'అదెందుకు...? ఏం లాభం" అని అడుగుతరని సిగ్గయితుంది.

ఆ సంగతి గుర్తు పట్టిండు ముత్తయ్య. "అన్నా... దేశంగాని దేశపోల్లకు ఏదేదో ఇస్తండ్రు. నేనేం పదవులడిగిన్నా...! పట్నంల భూములు అడిగిన్నా! గుట్టనో చెట్టో అయితే కరిగిపోతది. ఇరిగిపోతది. ఇది అరిగెడిదా... కరిగెడిదా..." ముత్తయ్య అన్నాడు.

అప్పుడే కాశీరాములు సెల్ మోగింది. ఎత్తి "ఇగో.... వస్తన్న...ఐదే నిమిషాలు" అంటూ సెల్ జేబులో ఏసుకుని డ్రైవర్‌ను కేకేసి "అరే ముత్తయ్యా! నెల రోజులు ఆగి కలువురా" అన్నాడు విసుగ్గా.

తొందర పడితే పనిగాదనుకున్నడు ముత్తయ్య. "నెల రోజులు కాకుంటే రెండు నెలలు తీసుకో.... పని మాత్రం ఇడువకు" అన్నడు అంటూ బయటకు నడిచిండు.

ముత్తయ్య బయటకు వెళ్ళడంతో కొద్దిగా దమ్ము తీసుకున్నడు కాశీరాములు. కానీ ముత్తయ్య పట్టుదలను చూస్తూంటే ఏదో పెద్ద లాభమే ఉన్నట్టుగా అనిపిస్తోంది రాములుకు.

ఏ పనైనా దాని లోతు పాతుల్ని చూసి గాని ముత్తయ్య మొదలుపెట్టడని తెలుసు. రెండేండ్లు కాలేజీలో పి. ఆర్వో.గా చేసిగాని కొత్త కాలేజీ పెట్టలేదు. రెండేండ్లు ప్లాట్ బ్రోకర్ దందా చేసిగానీ పరంపోగు భూమిని పట్టా అడగలేదు. యాదాద్రి ప్రొక్లయిన్ వెంట తిరిగి గానీ దానికోసం లోన్ అడుగలేదు. అటువంటిది వీడు ఏం చూసిండని దీన్ని అడుగుతుండు. అదీ వాని ఊరికిందున్న వాగును' అనుకున్నడు.

డ్రైవర్ కారును బయటకు తీసిండు. సెక్యూరిటీతో కారులో కూసున్నడు. కాశీరాములు కారు కదిలింది. కాశీరాములు ఆలోచనలు కదిలినయి. నిజంగా ఆయన ఎప్పుడూ ఆలోచించడు. ఆలోచించే టైం కూడా ఉండదు. ఈ మధ్యలో ఆయన 'టెన్ పర్సెంట్ స్కీం' ఒకటి పెట్టిండు. దానితో ఇంకా బిజీ అయిపోయిండు.

దాని మూలసూత్రం ఏమిటంటే ఎవరు ఏ కాంట్రాక్టు పని కావాలన్నా టెన్ పర్సెంట్ ముందుగానే తన ఎకౌంట్‌లో జమచేసి రిసీప్టుతో లైనులో నిలబడాలె. ఆ లైనిప్పుడు చాంతాడంత అయింది.

ఎవలను ఎటు తింపాలని చూస్తున్నప్పుడు కొత్తగా స్కీంలో ముత్తయ్య చేరిండు. సరే అందరి లెక్కన బియ్యం బుక్కుడో, పైసలు మింగుడో అడిగితే

లైన్లో నిలబెట్టి నెలకో ఆర్నెల్లకో మూతి తడుపుతుండె. కొండమీది కోతిని కోరేసరికి మర్మమేమిటో తెలువక సతమతమైతున్నడు కాశీరాములు.

కారు గేటు దాటింది. గేటు బయట ఒక వ్యక్తి కారును చూసి అడ్డంగా పరిగెత్తుకచ్చిండు. కాశీరాములు సైగను చూసి డ్రైవర్ కారును స్లో చేసిండు. కారులోంచి బయటకు చూస్తూ "అరే చంద్రం ఎటచ్చినవురా. అర్జంటు పని మీద పోతన్న. ఉండు అప్పటికి కలుద్దాం" అన్నడు కాశీరాములు.

ఇంకో క్షణంలో కారు వేగాన్ని అందుకునేదే! "అన్నన్నా! ... ఉండు ఒక్క నిమిషం. పేరు రాయించుకుందామని వచ్చిన. లక్ష రూపాయల పనిగావాలె" అంటూ జేబులోంచి పదివేలు జమ చేసిన బ్యాంకు ఓచర్‌ను తీసి ఇచ్చిండు.

ఓచర్‌ను చూసినంక కాశీరాములు మాట మారింది. "ఓర్నియ్యవ్వ... మల్లా ఏం పనిరో... మీ రేకులకుంట ఊరోల్లను సూత్తెనే భయమయితంది. అందులో నువ్వింక సర్పంచ్‌వి. కారెక్కు మాట్లాడుకుందాం" అని డోర్ తెరిచిండు.

సర్పంచ్ చంద్రం "ఏం లేదన్నా... మా ఊర్లె బడిని అప్‌గ్రేడ్ చేసినం. ఒక క్లాసు రూమ్ కావాలె. పిల్లగాండ్లు చెట్లకింద కూసుంటున్నరు" అంటూ కారు ఎక్కిండు.

పక్కనే సదురుకుని కూసుంటూ, "ఏమైందన్నా... రేకులకుంటోల్లను చూత్తే భయమెందుకయితంది...? ఎవడన్న పార్టీ మార్చిండా?" అడిగిండు చంద్రం.

కారు నడుత్తంది. మాటలు నడుత్తన్నయి.

కాశీరాములు నవ్వుతూ "కాదురా ! దునియలలేని బుద్దులు పుడుతయి మీకు. మీ ఊరి కింద వాగు లేదా.... అదే కావాలెనట" అన్నడు.

చంద్రం నవ్వబోతూ ఆగిపోయాడు. అతని మొఖం మారిపోయింది. "వాడు... నోముల ముత్తిగాడే గదన్నా.... అడిగింది?" అన్నడు చంద్రం.

కాశీరాములు కనిగుడ్లు తేలేసిండు. " అరే... నీకెట్ల తెలుసురా?" అని విచిత్రపోయిండు.

"అవ్వ పుట్టినిల్లు మ్యానమామకు కొత్తనా...రేకులకుంటల ఎవడేంది... ఎవని మర్మమేంది... మొత్తం తెలుసు. ఈ ఆలోచన వానికి తప్ప ఎవలకూ రాదు" చంద్రం అన్నడు.

ట్రాఫిక్‌ను దాటబోతూ సడన్ బ్రేకు వేసినట్టున్నాడు డ్రైవర్. ఇద్దరూ నిలదొక్కుకుని కూసున్నరు. కారు మళ్ళీ స్పీడందుకుంది. "ఏందిరా... ఊరుకు వసతులు ఊరోళ్ళే చేసుకోవాలె. అన్ని వసతులు మేమే చెయ్యాలంటే ఎట్లరా... ఇటువంటి కొన్ని పనులకు ప్రజల దగ్గర చందాలో గిందాలో అడిగి చెయ్యాలె. నాదాక రానియ్యద్దు. అది సరే! ఏందిరా కత! వాడు వాగును ఏం చేసు కుంటడంటవు. శవాల మీద పన్ను వసూలు జేత్తడా ఏంది?" ఆరా తీత్తున్నట్టుగా అడిగిండు కాశీరాములు.

"ఏమో నన్నా... తెలువది. ఆరు నెలల కింద మాత్రం సాత్ నంబరు కాలువను గుత్తకు తీసుకున్నడు. జనాలను ముప్పుతిప్పలు పెట్టిండు" చంద్రం చెప్పిండు. ఎమ్మెల్యేకు ఆదుర్దా పెరిగింది.

"అమ్మా... అది గూడ తొక్కి చూసిండా! అట్లజెప్పు. నేను ఏందిరో కత అనుకుంటి. ఆ...ఇంక... కాలువ గుత్త పట్టుకుని ఏం జేసిండు" ఆసక్తిగా అడిగిండు కాశీరాములు.

కారు పోతనే ఉంది. చంద్రం మొదలు పెట్టిండు.

★ ★ ★

"ఈ నడుమ నీటి సంఘాలు పెట్టుడు నయమయింది. కాదంటే ఈ కొట్లాటలు ఎట్ల తెగుతుండె. కాలువల దగ్గర కాళ్ళు తెగుతుండె... చెరువుకు మరమతులు రాకపోతుండె" ఒకటవ నెంబర్ కాలువ ఛైర్మన్ నర్సింగరావు అన్నడు.

"ఆ... ఆ... దాని సప్పుడే దొయ్యవారుడు లేదు. జక్కుల చెరువుకు ఏడు కాలువలు. కాలువకు ఒక ఛైర్మను. ఛైర్మనుకు ముగ్గురు సభ్యులు. సుంకర్లు నీరటికాల్లు పేరుకు మరి చెరువు. నిండింది లేదు. పంట పండింది లేదు" సాత్ నెంబర్ కాలువ ఛైర్మన్ నోముల ముత్తయ్య ముక్కు ఇరిసిండు.

ఇప్పుడు అదే సంగతి గదా మాట్లాడేది. లొటపెట పెదువులకు నక్క ఆసపడ్డట్టు మీదికి మొఖం బెట్టి సూడంగ సూడంగ మూడేండ్లకు ఇప్పుడు చెరువుల తడి కనవడే. దేశమంతా వరుదలచ్చి కొట్టుకపాయెగనీ చాట్ల తవుడు పోసి కుక్కలను ఎగేసినట్లు చెరువులకు చారాన మందమే నీళ్ళు వచ్చె" తీన్ నంబర్ కాలవ ఛైర్మన్ ఎంకటి అన్నడు.

"ఏం జేద్దాం... ఈ పావులమందం నీళ్ళను ఏ కాలువకిద్దాం ఎవల ముక్కుల పోద్దాం"

"కాలువకు పదెకురాల చొప్పున సాగు చేసుకోమందాం"

"అప్పుడు నీళ్ళు గాదు రక్తం పారుతది. పదెకురాల తైబందు అంటే ఎవలు ఆగుతరు"

ఏడుగురు ఛైర్మన్లు చెరువు కట్టమీదనే కూసున్నరు. నీళ్ళ గురించి మాట్లాడుతున్నరు. అది మాఘమాస సందు. నీళ్లు ఇడిస్తే నాట్లు వేసుకుందామని రైతులు చూస్తుండ్రు.

"ఈ నీళ్ళు ఇటు సాలయి. అటు సాలయి. చెరువులనే ఉంచుదాం. గోజకు గొడ్డుకు తాగుడుకు పనికత్తయి" నర్సింగరావు అన్నాడు.

అటు తొక్కుకుని ఇటు తొక్కుకుని అందరు సరే అన్నారు. ఒక్క సాత్ నెంబర్ ముత్తయ్య తప్ప. "చెరువుల నీళ్ళు చెరువుల ఉంటయి సరే! పడుమటి దిక్కున కట్ట సన్నవడ్డది. అది ఎవలు కట్టాలే" ముత్తయ్య అడిగిండు.

"పల్లె బాటల పెట్టినం గదా! సాంక్షన్ కాంగనే కడుదాం" ఎంకటి అన్నడు. అందరు 'ఊ' అన్నరు.

ముత్తయ్య విసుగ్గా చూసి "చేతులు కాలినంక ఆకులు పట్టుకునుడంటే ఇదే మరి. పల్లె బాటనే రావాలె. కట్టనే పొయ్యాలంటే ముసలిది పసిద్ద గావాలె. వచ్చే వానకాలంల కాలం మూడితే కట్టతెగేది మాత్రం ఖాయం" అప్పుడు జనం మనల్ని తిడతరు." అన్నారు.

అతడు ఏం చెప్పబోతుండో అందరికీ అర్థమయింది. కానీ అర్థం కానట్టు "నీళ్ళకు కట్టకూలెంక ఏందిరా..." అన్నరు.

ముత్తయ్య నవ్వుతూ "నీళ్ళకు కట్టకే గాదు. ఎలక్షన్ల ఖర్చు పెట్టినం సూడూ.... ఆ ఖర్చుకు గూడా సంబంధముంది. ఛైర్మన్‌కు మూడు వెయిలు ఇచ్చి కట్ట సంతంగ పోసియ్యాలె. ఎవలన్న కాలువ గుత్త పట్టుకోండ్రి. నోట్లె మాట బయట పడద్దు..." అన్నడు.

ఛైర్మన్‌కు మూడువెయిలు అన్నమాటలు కట్ట మరమత్తు కంటే ఎక్కువ పని చేసినయి. ఛైర్మన్లందరు బదులుకున్నరు. ఒక్కసాత్ నెంబరు కాలువ తప్ప అన్నీ కాలువల పారుకాలు పెద్దయి. నీళ్ళు సరిపోవు. అందుకని ఎవరూ నోరు విప్పలేదు.

చివరికి ముత్తయ్యనే "సాత్ నెంబరు కాలువ ఇడుసుకపోత, అన్న మాట నిలవెట్టుకుంట. అందరు సాత్ ఇయ్యండ్రి" అన్నడు.

"ఇత్తే ఇత్తంగానీ... మరీ ఇకారంగా మూడు వెయిలు ఇచ్చుడేందిరా...? ఎంత ఖర్చుపెట్టి గెలిచినం. ఏం కత. కనీసం ఐదన్నా సూడు..." నర్సింగరావు అన్నాడు.

నాలుగు వెయిలు దగ్గర బ్యారం కుదిరింది. సాత్ నెంబరు కాలువకు ముద్ర పడింది. కాయిదాలు, కత్తులు తయారైనయి. సంతకాలు చేసింద్రు. కాలువ ఇడిసింద్రు.

ఇది చూసి మిగిలిన కాలువల రైతులు కోపానికచ్చింద్రు. లొల్లి జేసింద్రు. మాకెందుకు నీళ్ళు ఇడువరని కొట్లాడింద్రు. నాలుగు వెయిలకు నానిన ఛైర్మన్లు వాళ్ళను సముదాయించింద్రు. కల్లు లొట్టిల ముంచింద్రు. కారపొట్లంల తీసింద్రు. మసి పూసింద్రు. మారెడు గాయ చేసింద్రు. సల్ల వడగొట్టి సాగనంపింద్రు.

ముత్తయ్య రంగంలకు దిగిండు. సాత్ నెంబరు కాలువకింద రెండు వందల ఎకురాల భూమి. చెరువుల నీళ్లతో మొత్తం కాస్తు అయితది. ముత్తయ్య మాత్రం వంద ఎకురాలే కాస్తు చేసుకొమ్మని ఎకురాన రెండువందల యాభై రూపాయలు తీసుకున్నడు.

మిగిలిన వంద ఎకరాలను బ్లాకు చేసిండు. వాళ్ళను ఒంటిగా కలువడం తగదప్ప రాని రేటు చెప్పడం, అందినకాడికి గుంజి పర్మిషన్ ఇవ్వడం. మొత్తం మీద సాత్ నెంబర్ కాలువ కింద మొత్తం కాస్తు నెల రోజుల్లో నాటు పడింది.

కాలువ ఎంట కొన్ని కరెంటు మోటర్లున్నయి. కొన్ని బోరుపొక్కలున్నయి. కాలువ ఎప్పుడైతే పారడం మొదలు వెట్టిందో అప్పుడే బాయిలు బోరుపొక్కలు నిమ్మెత్తినయి. ఊటలు మర్రినయి. రైతులు దున్నినాట్లు ఏసుకున్నరు. వాళ్లను పైసలియ్యమని అటుకాయించిండు ముత్తయ్య.

"కాలువల నుంచి నీళ్ళు ఇత్తున్నవా..? మేమెందుకు ఇత్తం...?" అన్నరు రైతులు. "యియ్యరా...ఎట్లియ్యరో సూత్త?" అనుకున్నడు ముత్తయ్య. సక్కగ చెరువు కట్టమీదికి పోయిండు. తూమును దిగేసిండు. కాలువ ఎండిపోయింది.

ఇదేం కత అన్నరు రైతులు. అదేం కత అన్నడు ముత్తయ్య. దానికి దీనికి లింకేంటిది అన్నరు రైతులు.

ముత్తయ్య ఓపికగా "ఓరి పిచ్చోళ్ళు బాయిలల్ల నీళ్ళు ఎక్కడియిరా.... కాలువ ఊటనే గదా! వాళ్ళు మోటర్లతో ఎత్తిపోత్తుంటే కాలువల నీళ్ళన్నీ బాయిలకు దిగుతయి. నిండు పొట్టల మీద నీళ్ళు సాలక మీ చేన్లు ఎండుతయి" భయపెట్టిండు.

రైతులు పుట్టెడు ఖర్చు పెట్టుకుని గోసలోలె ఉన్నరు. ముత్తయ్య మాటలకు భయపడ్డరు. కరంటు బాయిలున్న రైతులను సాగు చెయ్యద్దు అన్నరు. ఆ రైతులు వినలేదు. 'ఎట్ల వినరో చూస్తం" అని ఈ రైతులు అనుకున్నరు.

తెల్లారినుంచి కరెంటు మోటర్ల ఫీజులు మాయం? షాటర్లు మాయం. చేన్లు బర్లు తొక్కుతున్నయి. రాత్రికి రాత్రే సర్వీసు వైర్లు మాయమైతున్నయి. బోర్లల్ల రాళ్ళు దిగుతున్నయి. దొంగలెవరో దొరుకుతలేరు.

ఈ దాడిని తట్టుకోలేక కరంటు మోటర్ల రైతులు ముత్తయ్యను కలిసింద్రు. ముడుపులు ఎంతో కొంత ఇచ్చింద్రు. కాలువకు అటు మైలు ఇటు మైలు దూరంలో ఉన్న రైతులు గూడా ముత్తయ్య చేతుల కిందికి వచ్చింద్రు.

సట్టి శివరాత్రి సందు. ఆ సందుల వరి చేన్లు నిండు కరుకు మీదుంటయి. ఒక్కపూట తడి తేలిపోయినా కర్రలు సచ్చిపోతయి. ఆ సందులనే బెస్తలు వలలు పట్టుకుని చెరువులకు దిగింద్రు! ఇత్తునం మీదైతే నీళ్ళనాయి. మీతో నాకు పాలు' అన్నడు ముత్తయ్య.

"నువ్వు కులం గాదు తలం కాదు... నీ కెక్కడిది పాలు. చెరువు నీ అయ్య జాగీరా" అన్నారు కోపంగా బెస్తలు. ముత్తయ్య నోరు తెరువలేదు. సక్కగ చెరువు కట్ట ఎక్కిండు. తూమును దిగేసిండు. నీళ్ళు లేక కాలువ పొక్కలల్ల నక్కిన చేపపిల్లలు గిలగిల కొట్టుకున్నయి. వాటి లెక్కనే రైతులు కొట్టుకున్నరు.

ఈ కతేంటీ అని రైతులంటే ఆ కతేంటీ అని ముత్తయ్య అన్నడు. దానికి దీనికి లింకేంటీ అంటే "సన్నాసుల్లారా... చాపలు పడితే చెరువు మడుగైతది. నీళ్ళు లోతుల పడతయి. నాసు గడ్డకు వడుతది. అసలే మన కాలువ ఎత్తు మీదుంది" అని భయపెట్టిండు.

రైతులకు నిజమే అనిపించింది. అడుగు నీళ్ళు లోతుకు దిగినా పారుకం ఎత్తిపోతది. 'ముందు జాగ్రత్త లేకుంటే మనమే మునుగుతం' అనుకున్నరు. అందరు ఏకమై బెస్తలను బెదిరించింద్రు. బెస్తలు వినలేదు. ఎట్ల వినరో చూస్తం అనుకున్నరు రైతులు.

ఒకనాడు వలలు మాయం. ఒకనాడు చాపలు మాయం. ఒకనాడు తోపెలు మాయం.వాటిని తట్టుకోలేక బెస్తలు ముత్తయ్యను కలిసింద్రు. రాత్రికి రాత్రి ఒప్పందం కుదిరి అంతా సల్లారిపోయింది.

వరి సూది పొట్ట మీదికి వచ్చింది. ఒక్క తడి పారకపోతే పొట్ట వక్కిపోతది. ఎండాకాలం ముదురుతుంది గదా! అప్పుడే చెరువుల ఇటుక బట్టీలు పెట్టింద్రు.

ముత్తయ్య వాటా అడిగిండు. మన్ను తీసినోనివి గాదు నీళ్ళు మోసినోనివి గాదు వాటా ఎక్కడిది అడిగితే బొక్కులిరుగ దంతం అన్నారు..

ముత్తయ్య మారు చెప్పలేదు. సక్కగ కట్టమీదికి వచ్చి తూము దిగేసిండు. రైతులు గుండెలు దడదడమన్నాయి. ఇదేంటి కత అంటే అదేంటి కత. దానికి దీనికి లింకేంటిదీ అంటె మట్టి తీస్తే నీళ్ళు లోతులపడి తూము ఎత్తిపోతదని రైతులు చెప్పడం, వాళ్ళు వినకపోవడం. ఇటికలు మాయం. సాంచాలు మాయం. బట్టీ సల్లారిపోవడం. రాత్రికిరాత్రి ఒప్పందం. వాటా పుట్టడం అంతా అయిపోయింది.

అసలే ఎండాకాలం. అందునా కరువు దినం. పెండ్లీలు పేరంటాలు. చెరువుల నుంచి ట్యాంకర్లతో నీళ్ళు తెచ్చుకుంటరు. ముత్తయ్య రైతులను చెరువు మీద కావలి పెట్టిండు. ఓనర్లు రేటును పెంచి ముత్తయ్యకు వాటా ఇచ్చిండ్రు.

వరి నిండు పొట్ట మీదికి వచ్చింది. పొట్ట మీద పుట్టెడు నీళ్ళు కావాలె. అప్పుడే కట్టపని యాది కచ్చింది ముత్తయ్యకు. "కట్ట పొయ్యాలె... కట్ట పొయ్యాలె" అని రైతులకు చెప్పిండు. ఎవలూ చెవున పెట్టలేదు. మీరు ఎట్ల ఇంటరో నాకు తెలుసు అనుకున్నడు. కట్ట ఎక్కి తూము దిగేసిండు.

రైతులు గుండె దడదడ కొట్టుకుంది. ఇదేం కత అంటే అదేం కత.

ముత్తయ్య రైతులందరిని కూసోబెట్టి "చెరువుకు ఏడు కాలువలున్నాయి మన ఒక్క కాలువనే పండించుకుంటున్నం. అయినా ఎవలన్నా నోరు తెరుస్తండ్రా. పంట తీసుకున్నందుకు కట్ట పోత్తే తప్పేంది ముందే నేను వాళ్లకు మాట ఇచ్చిన" అన్నాడు.

రైతులకు నిజమే అనిపించింది. ఇంటి కిద్దరు మనుషుల చొప్పున వారంలో కట్ట పోసిండ్రు. ముత్తయ్య పొద్దు మాపు కట్టమీదనే ఉంటుండు. చిన్న పనికి పెద్దపనికి చెరువును ఎట్ల వాడుకోవాలని చూస్తండు.

అప్పుడే రామనవమి. రాములు సీత పెండ్లి. ఊరన్నంతల ఊదుబత్తితోనో, కొబ్బరికాయతోనో ఐదు పిడికెళ్ళ బియ్యంతో పండుగు జేత్తురు "ఈసారి పండుగ పెద్దగ జేత్తాం. సాత్ నెంబరు రైతులు నిలవడుతరు" అన్నాడు ముత్తయ్య.

ఊరు రైతులంతా "నిజమే! పంట తీసుకుంటున్నారు. దేవుని లగ్గం జేత్తే తప్పేంటిది... చెయ్యాలె" అన్నారు.

సాత్ నెంబరు రైతులకు నాలిక సందున ముల్లు ఇరిగినట్టయింది. ఒప్పుకోక తప్పింది గాదు. ఇంటికిన్ని బియ్యం.... ఎకురానికిన్ని పైసలు, ముల్లెను, మూటను ముత్తయ్య చేతులు పెట్టింద్రు.

కొబ్బరి కాయకు చిట్టి పెట్టి ప్రసాదానికి రేటు గట్టి పండుగను పెద్దగచేసిండు ముత్తయ్య. పెద్దగనే ఎనుకేసిండు. అనుమానం రాకుండా పదకొండు రోజులు 'హనుమాన్' మాలేసిండు. సాత్ నెంబరు బాగా పండాలని మాల ఏసుకున్ననని ఎలాన్ చేసిండు.

వరి ఈనుతోంది. ఈను పొట్టలమీద ఒక్క తడి తక్కువైనా పొట్ట నోరు దెరుత్తది. పాలు పోసిన గింజలు తెల్లవడుతయి. అందుకే రైతులందరు కర్ర కర్రను పట్టి చూసుకుంటున్నరు. ముత్తయ్య మాత్రం రైతులనే చూస్తుండు.

అప్పుడే రెండు కరెంటు ట్రాన్స్‌ఫారంలు కాలిపోయినయి. రైతులను ఎట్టి వట్టి వాటిని తెప్పించిండు. కొత్తగ రెండు కరెంటు లైన్లు సాంక్షన్ అయినయి! మీరేగదా....! మోటర్లు నడుపుకునేది అని సాత్ నెంబరు రైతులను ఎట్టివట్టే లైన్లు వేయించిండు. శ్రమదానం పేరు జెప్పి సాత్ నెంబర్ కాలువ కట్టను నునుపు జేసింద్రు. తర్వాత ఆ పనిని 'పనికి బియ్యం' స్కీము కింద నమోదు జేసుకుని బియ్యం బుక్కిండు అది వేరే సంగతి ఊరి రైతులు మాత్రం ముత్తయ్యను 'సరేరా' అన్నారు.

చేన్లు ఈని బలెవడుతున్నయి. ఎండలు ముదిరినయి. చెరువుల నీళ్ళు పూర్తిగా తగ్గినయి. అయినా పంటలకు ధోఖా లేదని కొందరు, పండుతయో ఎండుతయో అని కొందరు అనుకుంటున్నరు. అప్పుడు ముత్తయ్య ఆరుగురు చైర్మన్లలను పిలుచుకున్నడు. చెవుల ఏదో చెప్పిండు. వాళ్ళు 'నిజమే' అని తూమును దిగేసింద్రు.

లబోదిబోమని రైతులు కట్టమీదికి పరుగెత్తు కొచ్చింద్రు.

అక్కడు ఆరుగురు చైర్మన్లు ఒక్క గొంతుతో "చెరువును బోర్లేసుకుని బొట్టు బొట్టు జారేసుకుని పంటలు పండించుకుంటరు సరే! ఊర్లె గోజలు గొడ్డులుండయా.... వాటికి కనీసం తాగుడుకన్నా నీళ్ళు వద్దా...? వాటి గతి ఎట్ల...?" అన్నరు. "ఊరంతా సాటింపు జేత్తం... రైతులందరికి చెప్పి ఎగేత్తం" అని భయపెట్టింద్రు.

అప్పటికే ఊర్లె సాత్ నెంబరు రైతు, వట్టి రైతు అని రెండు గ్రూపులయినయి. అందరి కండ్లు సాత్ నెంబరు రైతుల మీదున్నయి. సందు దొరికితే ఒత్తుదామని

చూస్తంద్రు. కర్ర ఎర్రపడుతుంటే కన్ను ఎర్రపడుతుంది. ఊరందరికి పగదారులయింద్రు.

సాత్ నెంబరు రైతులకు దడ పుట్టింది. గడ్డకు పడేటయానికి ఇదేం కతరో అనుకున్నరు. ముత్తయ్యను కలిసింద్రు. ముత్తయ్య గూడా "ఎంత పనైపాయె" అని బాధపడ్డాడు. సంగతి రైతుల దాకా పోనియద్దని భయం చెప్పిండు. ఎకురాన ఎంతో కొంత జమ చెయ్యండ్రి. వాళ్ళ మోఖాన కొడుదామని దారి చెప్పిండు.

పొద్దుగూకే వరకు పైసలన్నీ వసూలైనయి. ఆ రాత్రి రెండు కల్లు పెట్టెలు ముందట పెట్టి మూతి తడిపి తూము ఎత్తుమన్నడు ముత్తయ్య చైర్మన్లను.

"అరే... పైసలు వసూలు జేస్తనంటివి. మాకిన్ని ఇస్తనంటివి. .. ఇయ్యవా...? చైర్మన్లు అడిగింద్రు.

ముత్తయ్య నవ్వి "ఇంకా మొత్తం వసూలు కాలేదు. రెండు మూడు రోజులు ఆగని. లెక్క తర్వాత సూసుకుందాం. మొదాలు తూమును ఎత్తుండ్రి" అన్నాడు.

చైర్మన్లు తూము ఎత్తింద్రు. వారం తర్వాత ఒకరోజు రైతులను పిలుచు కున్నడు ముత్తయ్య. మనిషికో కల్లుసీస ముందట పెట్టిండు. "వారీ... మంచికో చెడ్డకో కాలువ గుత్తపట్టుకున్న. లాభమే వచ్చిందో లాసే వచ్చిందో నాకే ఎరుక. దేవునికే ఎరుక. మీకిచ్చిన మాటనైతే తప్పలేదు. పంట పండిత్తనన్న. పండిచ్చిన. వానితోని కంటు...వీనితోని కంటు...అడ్డమైనోని కాళ్ళు మొక్కుడు....చ.....చ.... కలల ఉచ్చదాగి చెప్ప దోసమన్నట్టు... ఇసొంటి పని జన్మల చెయ్యద్దని చెంపలేసుకుంటున్నా. చేన్లు కొన తడులకచ్చినయి. రేపో మాపో తప్ప గట్టుకోండ్రి. మీకూ నాకూ చుక్తా" అన్నాడు.

రైతులు "ఎవరి నియ్యతు వానికి. మనను ముంచినోడు పొడువైతడా....?" అని కొందరు "కట్టమో నిట్టూరమో మనను పట్టుకుని ఉన్నాడు" అని కొందరు, "అబ్బో... వాడా....వాడు... చెత్తల చెడుగు. నారముచ్చోడు" అని ఇంకొందరనుకున్నారు.

అప్పటికి చేన్లు బలెపట్టినయి. బెరికి కర్రలు ఎర్రపడుతున్నయి. అరిచేతులల్ల పాణాలు పట్టుకున్న రైతులు కొంత కుదుట పడ్డరు. లాగోడి ఖర్చు.... వచ్చేపంట లెక్క జూసుకుంటే అల్లికి అల్లి... సున్నకు సున్న. చేసిన కట్టం ఎట్టి కట్టం.

రెండు రోజులన్నది వారం గడిచింది. ముత్తయ్య ఛైర్మన్లకు ఒక కొత్త ఇయ్యలేదు. అసలు ఊర్లెనే లేదు. ఛైర్మన్లు మంట మండ్రిడు. 'అన్ని పైసలు ఒక్కడే తింటడా' అనుకున్నరు. తూము దిగేసి తూము మీద కూసున్నారు.

ఇత్తు గట్టిపడేయాల్లన మడి ఆరితే పంట సగం పొల్లు పోతది. రైతుల గుండె జల్లుమంది. లాభం లాసు లెక్కగట్టుకున్నంక కండ్లకు రక్తమచ్చింది. పంట ఎండితే బతుకుదెరువె లేదనుకున్నరు. సావో రేవో అన్న తెగింపు. టయానికి ముత్తయ్య గూడా దొరుకలేదు.

మంటర మంట అందరు చెక్కపారలు, గడ్డపారలు అందుకున్నరు. అడ్డమచ్చినోన్ని తూముల తొక్కింద్రు. తూమును ఎత్తింద్రు. కొన్ని నీళ్ళు.... కొంత రక్తం కలెగలిసి పౌరుషంలా పొంగి పారినయి.

★ ★ ★

"అదన్నా... కత. ఆ టైంల రైతులను చూస్తే నాకే భయమయింది. ఛైర్మన్లు ఎవలు నోరెత్తినా.... ముత్తిగాడు కనవడ్డా తూముల బొంద వెడుదురు. అంత తెగింపుగున్నరు" చంద్రం చెప్పడం ఆపిండు.

కారు బస్టాప్ ముందు ఆగింది. కాశీరాములు ముసిముసి నవ్వింఁడు. కొత్త సంగతి విన్నట్టు. తన సమస్యలన్నింటికి పరిష్కారం దొరికినట్టు అతని మొఖంలో వెలుగు నిండింది.

"వాడురా... మనిషంటే... చిన్న కాలువతోనే ఊరిని అంత డెవలప్ జేసిండంటే పదూర్ల పెట్టు పారే వాగును తీసుకుంటే పదూర్లల్ల పనులు జేయిస్తడు. మనకు నొయ్యకుంట చెవులు కుట్టేటోడు గావాలె. వాన్ని పొద్దుగూకే వరకు నా దగ్గరికి తీసుకరా... రెండురోజులల్ల పని చేసిపెడుత" దిగుమన్నట్టు డోర్ తెరిచిండు కాశీరాములు.

చంద్రం కారు దిగుతూ "అన్నా....మరి నా పని..." అన్నాడు అనుమానంగా. కాశీరాములు నవ్వి "ఒక్క బడి గాదురా... ఊరికి ఇంకేం గావాలన్నా వానితోనే చేపిద్దాం. ఊర్లు బాగుపడుతయి. మీరు బతుకుతరు. డెవలప్ జేసిండని ఓట్లేత్తరు గావట్టి నేను బతుకుత. ఒక దెబ్బకు రెండు పిట్టలు రాల్తయి" అన్నడు.

"అన్నా... జనం తిరుగవడుతరేమో.. వాగును లీజుకిచ్చుడంటే మాటలా... ఎందరు దానిమీద బతుకుతరు. కాలం ముందటి లెక్కలేదు" చంద్రం అన్నడు.

కాశీరాములు మళ్ళీ నవ్వి "పాము మందు పాము కుంటది. తేలు మందు తేలుకుంటది. దేని మందు దానికే ఉంటది. ముత్తిగాడు సూడు. సాత్ నెంబరు రైతులు 'కాదు' అంటే 'అవును' అని ఎదురు నిలువడానికి సగం ఊరును తయారు చెయ్యలేదా... అదీ! నీకు తెలువది. పక్క రాష్ట్రంల నదులనే అమ్ముకున్నరు గదరా... దాని చట్టాలు దాని కుంటయి. ముత్తిగాడు ఎడ్డోడా.... ఈ పనికి నిన్ను గాదని నన్నెందుకు వట్టిండు. చట్టం ఒకటి ఉంటదనేగా ... కానూన్ కానూనే..."

కారు వెళ్ళిపోయింది.

చంద్రంకు కొత్తగా వచ్చే కాంట్రాక్టులే కండ్ల ముందు కదిలినయి. ఎంత తొందరగా ముత్తయ్యను కలుద్దామా అన్న ఆదుర్దాతో బస్సు ఎక్కిండు.

● విపుల - నవంబరు, 2006 ●